క్లుప్తంగా

16నుంచి రెవెన్యూ సదస్సులు

భువనగిరి : మండలంలోని మిగిలిన గ్రామాలలో ఈ నెల 16 నుంచి భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంజిరెడ్డి శనివారం తెలిపారు. ఈ నెల 16న వీరవెల్లి, బస్వాపురం, 17న బండసోమారం, హుస్నాబాద్, 18న అనంతారం, రామచంద్రపురం, 19న రాయగిరి చీమలకొండూరు, 20న భువనగిరి, బోమ్మాయిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

దివిస్‌కు ఉత్తమ రక్తదాత అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న దివీస్ పరిశ్రమ ప్రతినిధి బి.కె.కె.చౌదరి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ లింగోజిగూడెం పరిధిలోని దివిస్ పరిశ్రమకు రాష్ట్ర ఉత్తమ రక్తదాత అవార్డు లభించింది. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శనివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా దివిస్ పరిశ్రమ ప్రతినిధి బి.కె.కె చౌదరి అవార్డు అందుకున్నారు. పదేళ్ల నుంచి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అధికంగా బ్లడ్ యూనిట్‌లను అందజేసినందుకు గాను అవార్డు లభించినట్లు పరిశ్రమ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, నటరాజ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

రామన్నపేట : రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆవనగంటి స్వామి కోరారు. రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో విడుదల చేసి మాట్లాడారు. గ్రామాల్లో మోడ్రన్ దోబీఘాట్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొండూరు శంకర్, పొన్నం ఉప్పలయ్య, బోనగిరి శ్రీనివాస్, అక్కెనపల్లి లింగయ్య, పొట్లచెర్వు నాగయ్య, మాంద్ర మల్లేష్, భూపాల్, గోలి స్వామి పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం



చల్లా రాంరెడ్డి

రామన్నపేట: రామన్నపేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన చల్లా రాంరెడ్డి అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ పి. మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీ రాత్రి రాంరెడ్డి ఇంట్లో భోజనం చేసి ఆరుబయట నిద్రించాడు. రాత్రి రెండు గంటల సమయంలో కుటుంబ సభ్యులు లేచి చూడగా.. రాంరెడ్డి కనిపించలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించక పోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



దగ్ధమైన ఎలక్ట్రిక్ బైక్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో శనివారం ప్రమాదవశాత్తు ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం వడాయిగూడేనికి చెందిన నీల బాలరాజు తన ఎలక్ట్రిక్ బైక్‌పై యాదగిరిగుట్టకు వచ్చాడు. ఈ సమయంలో బైక్ వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు రావడంతో పక్కకి నిలిపి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు.

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చౌటుప్పల్ : పట్టణంలోని శ్రీపాటిమీది భక్తాంజనేయస్వామి దేవాలయంలోని శివాలయ 6వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. దేవాలయ నిర్మాణ దాతలు సోమవరపు సత్తయ్య-వెంకటమ్మ, కుమారులు రమేష్-దీప్తి, సురేష్-సుష్మలు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

చౌటుప్పల్ : అనుమతులు లేకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తూ సెలవు రోజులో పాఠశాల నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని పాఠశాలలో నాయకులు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, వరుణ్‌తేజ, రాము, నందు, రాకేష్ ఉన్నారు.

మోటకొండూరు అభివృద్ధికి అడుగులు

- ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు
- రూ.8.25 కోట్లు మంజూరు
- పిల్లర్ల దశలో పోలీస్‌స్టేషన్ భవనం
- ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి త్వరలో టెండర్లు



సీపీ ప్రత్యేక నిధులతో నిర్మిస్తున్న పోలీస్‌స్టేషన్ భవనం



బాలుర వసతిగృహంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

మోటకొండూర్ : తొమ్మిదేళ్ల తరువాత మోటకొండూరు మండల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల కోసం ప్రభుత్వం రూ.8.25 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పిలిచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా 2016 అక్టోబర్‌లో దసరా రోజున కొత్తగా మోటకొండూరు మండలం ఏర్పాటైంది. తొమ్మిదేళ్లు గడిచినా పాలన గాడిన పడలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోని ఇరుకు గదులు, అసౌకర్యాల నడుమ కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు.

భవనాలకు నిధులు మంజూరు..

తహసీల్దార్ కార్యాలయానికి రూ.2.85 కోట్లు, ఎంపీడీఓ కార్యాలయానికి రూ.2.8కోట్లు, పోలీస్‌స్టేషన్ భవనానికి రూ.2.6కోట్లు మంజూరయ్యాయి. ఇందులో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. ప్రస్తుతం పిల్లర్ల దశలో ఉన్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల భవనాలకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉంది.

మిగతా వాటి పరిస్థితి ఏమిటి?

విద్యుత్, పశువైద్య కేంద్రం, మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల, మండల వ్యవసాయ కార్యాలయం, పీఆర్ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇరి గేషన్, మిషన్ భగీరథ శాఖలకు పక్కా భవనాలు లేవు.

సబ్ మార్కెట్ అప్‌గ్రేడ్‌తో పాటు పీఏసీఎస్ తరలింపు జరిగేనా...

మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డ్ గతంలో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు అప్పటి మంత్రి హరీష్‌రావు ప్రకటన చేసి జీఓను విడుదల చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అమలు చేస్తుందా లేదా అని మండల ప్రజలు సందిగ్ధంలో ఉండగా ప్రభుత్వ విప్ బీర్ల ప్రకటనతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే మోటకొండూర్ మండలానికి పీఏసీఎస్ సెంటర్ ప్రత్యేకంగా ఇప్పటి వరకు లేదు. పాత పీఏసీఎస్ పరిధిలోని గ్రామాలకు అలాగే కొనసాగాయి. కాని త్వరలో పీఏసీఎస్ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఎప్పటికి హామీ అమలు కానుందో అని రైతులు చూస్తున్నారు.

స్థల కేటాయింపే ప్రధాన సమస్య..

మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ ఇతర రైతుల చేతిలో ఉండడంతో వాటిని ప్రభుత్వం తీసుకోవడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రభుత్వ భవనాలకు స్థలం కేటాయింపే ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో పక్కా భవనాల ఊసే అటకెక్కింది. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం, ప్రభుత్వం కలిసి స్థలం కేటాయింపును చేసి త్వరతిగతిన మండల కార్యాలయాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు రవాణా అంతంతే...

మోటకొండూర్ మండలం ఏర్పాటు చేసిన అనంతరం కలిపిన ఆయా గ్రామాలకు లింక్ రోడ్డులతో పాటు రవాణా సౌకర్యాన్ని ఇంత వరకు కల్పించలేదు. దీంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అభివృద్ధికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్న



“ఆలేరు ప్రజలు నన్ను నమ్మి నాకు ఎమ్మెల్యే పదవిని ఇచ్చారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తా. మండలంలోని ప్రతి గ్రామానికి నీరు అందించడంతో పాటు పక్కాభవనాల నిర్మాణం, రోడ్డు రవాణా సౌకర్యం, మార్కెట్ యార్డ్ అప్‌గ్రేడేషన్, పీఏసీఎస్ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తా.

– బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే

మండల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



“తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం మోటకొండూర్ మండలాన్ని అనాలోచితంగా దగ్గరలోని గ్రామాలను చేర్చకుండా సుదూరంగా ఉన్న గ్రామాలను కలిపి మండలంగా అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అనంతరం ఎలాంటి ప్రభుత్వ పక్కా భవనాలు నిర్మించకుండా అభివృద్ధిని గాలికి వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి సాధ్యం అవుతుంది.

– యెల్లంల సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

రవి ఆత్మహత్యపై విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్

యాదగిరిగుట్ట : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంట్లో పనిచేసే సహాయకుడు గంధమల్ల రవి ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని, పోలీసు ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉరివేసుకున్న గంధమల్ల రవి మృతదేహాన్ని రాత్రికి రాత్రే భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని పోలీసులు, అధికారులపై బీర్ల ఐలయ్య ఒత్తిడి తీసుకువచ్చినట్లు అనుమానాలు వస్తున్నాయన్నారు. రవిది హత్య, ఆత్మహత్యనా అనే అంశాలపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, నిగ్గు తేల్చాలన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య రూ.5కోట్ల నష్టపరిహారంతో పాటు ఆయన కూతుర్ల చదువు, పెళ్లి బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ ఒగ్గు భిక్షపతి, నాయకులు సయ్యద్ బాబా, పేరబోయిన సత్యనారాయణ, కొన్యాల నర్సింహరెడ్డి, గ్యాదపాక క్రాంతికుమార్, శారాజీ రాజేష్, దావూద్ షేక్, యాకూబ్, వీరేశం, రమేష్ తదితరులున్నారు.

గంధమల్ల రవి మృతిపై విచారణ జరిపించాలి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహాయకుడు గంధమల్ల రవి మృతిపై విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం రాత్రి రవి పట్టణంలోని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఇంటి నాల్గవ అంతస్తులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటే, ఆ విషయాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారని ఆరోపించారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్య ఈ విషయాన్ని అధికారులకు, మీడియాకు అదే సమయంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. గంధమల్ల రవి మృతిపై అనుమానాలు ఉన్నాయని, తన భార్యను సైతం బెదిరించి ఫిర్యాదు రాయించినట్లు నియోజకవర్గ ప్రజలకు అనుమానం ఉందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, మండల మాజీ అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజు నరేష్, జెల్లా భానుచందర్, సీనియర్ నాయకులు బందారపు మల్లేష్‌గౌడ్, పట్టణ కార్యదర్శి ఆలేటి కర్ణ, మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్, శివరాత్రి శ్రీశైలం, కర్రె శ్యామ్, సంద ప్రవీణ్ తదితరులున్నారు.

ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

మోత్కూరు : వచ్చే నెల 7న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం కూరెళ్ల శ్రీరాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు లేని నూతన సమాజం నిర్మాణం కాంక్షిస్తూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందన్నారు. సమాజ హితమే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ పోరాడుతుందని అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అడ్డగూడూరు మండల అధ్యక్షుడు సూరారపు రాజు, టౌన్ అధ్యక్షుడు గజ్జెల్లి వినోద్, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా స్వర్ణగిరీశుడి నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళ హారతుల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో శనివారం కావడంతో భక్తులు స్వామి వారికి దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



యాదగిరిగుట్ట : డీసీపీకి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆలేరురూరల్ : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు బుగ్గ నవీన్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే ఇంట్లో పనిచేస్తున్న రవి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుంటే ప్రతిపక్ష నాయకులు కావాలనే బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసత్య ప్రచారాలు ఖండిస్తున్నామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బుగ్గ నరేష్, శ్రీహరి, నరేష్, సురేష్, సారయ్య, రమేష్, నర్సింహులు పాల్గొన్నారు.

డీసీపీకి కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

యాదగిరిగుట్ట : ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై కొంత మంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ, వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కల్గిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీపీ ఆకాంక్షకు శనివారం ఫిర్యాదు చేశారు. బీర్ల ఐలయ్య ఇంట్లో వంట పనిచేసే గంధమల్ల రవి తన వ్యక్తిగతమైన, ఆర్థికమైన సమస్యలతో మద్యానికి బానిసై శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసుల దర్యాప్తు జరుగుతున్నా కొంత మంది సోషల్ మీడియాలో రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలనే ఉద్దేశంతో అసత్య, నిరాధారణ ఆరోపణలు చేస్తూ పోస్టులు చేస్తున్నారని అన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు సంజీవరెడ్డి, భిక్షపతి, అశోక్ తదితరులున్నారు. కాగా.. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడుకు సైతం సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు, సీనియర్ నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్, పెద్దకందుకూర్ మాజీ సర్పంచ్ రాములు ఉన్నారు.

రవి మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

భువనగిరి : ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య నివాసంలో ఆత్మహత్య చేసుకున్న గంధమల్ల రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శనివారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మార్చురీలో రవి మృతదేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య సందర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోస్టుమార్టం అయ్యే వరకు అక్కడే ఉండి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే క్రమంలో ఆయన కూడా అక్కడికి వెళ్లారు. ఆయన వెంటన యాదగిరిగుట్ట మాజీఎంపీపీ శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజీమార్గంతో కేసులు సత్వర పరిష్కారం



ఆలేరు : లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి అజయ్‌కుమార్



చౌటుప్పల్ : లోక్‌అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తి మహతీవైష్ణవి, న్యాయవాదులు



రామన్నపేట : లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న జడ్జి సబిత

ఆలేరు : రాజీమార్గంతో కేసులు సత్వర పరిష్కారమవుతాయని, క్షణికావేశంతో గొడవలు పడి పరస్పరం కేసులు పెట్టుకొని ఇబ్బందులు పడొద్దని ఆలేరు జూనియర్ ప్రథమ శ్రేణి సివిల్ కోర్టు జడ్జి ఆర్.అజయ్‌కుమార్ సూచించారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలేరు, గుండాల, మోటకొండూరు, ఆత్మకూరు పోలీస్‌స్టేషన్లకు చెందిన రాజీపడతగిన 146 కేసులను పరిష్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ పద్మ, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం రాజు, ఆలేరు సీఐ కొండల్‌రావు, మోటకొండూరు, ఆత్మకూరు, గుండాల ఠాణాల ఎస్ఐలు ఉపేందర్, కృష్ణయ్య, సైదులు, కోర్టు సూపరింటెండెంట్, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల రాజీతో కక్షిదారులకు ప్రయోజనం

చౌటుప్పల్ : కేసుల రాజీతో ఇరువైపుల కక్షిదారులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతుందని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మహతీవైష్ణవి అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాలకు సంబంధించి 2842 కేసులను పరిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడారు. రాజీ చేసుకోకుండా ఉండడంతో ఇరువురు చాలా రకాలుగా నష్టపోవాల్సివస్తుందన్నారు. రాజీతో ప్రధానంగా మానసికమైన ప్రశాంతత లభిస్తుందన్నారు. న్యాయవాదులు, పోలీసులు కేసుల రాజీ విషయంలో కక్షిదారులను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని సూచించారు. అత్యధికంగా కేసుల రాజీ జరగడంలో న్యాయవాదులు, పోలీసుల సహకారం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి, ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్‌రెడ్డి, న్యాయవాదులు ఊడుగు శ్రీనివాస్, ముత్యాల సత్తిరెడ్డి, తాడూరి పరమేష్, అల్లి స్వాతి, జెల్ల రమేష్, ఖయ్యూంపాషా, మక్తాల నర్సింహ, దేశగోని శ్రీశైలం, పరమేష్, శ్రీశైలం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలి

రామన్నపేట : లోక్ అదాలత్‌లో రాజీపడదగిన కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 295 డ్రంకెన్ డ్రైవ్ కేసులు, 2 ప్రీలిటికేషన్ కేసులు, 24 ఎక్సైజ్ కేసులు, 85 ఇతర కేసులు పరిష్కారమైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు కొవ్వొత్తుల నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

మోత్కూరు : గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతులకు శనివారం మున్సిపల్ కేంద్రంలోని శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద ప్లకార్డులు ప్రదర్శించి కొవ్వొత్తులతో బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఒక్కో కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, నాయకులు ఎండీ.రఫీ, రూబెన్, ఫిరోజ్, జినుకల మత్స్యగిరి, బోడ భాస్కర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

వలిగొండ : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు మతోన్మాదాన్ని రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను హతమార్చడం బీజేపీ నాయకుల పనిగా పెట్టుకున్నారని, దేశంలో తీవ్రవాదుల పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ రైతు కార్మిక కర్షక సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని అన్నారు. సమావేశంలో బోడ సుదర్శన్, ఎలగందుల అంజయ్య, పోలేపాక యాదయ్య, సలిగంజి వీరస్వామి, యాదగిరి, సత్యనారాయణ, బోడిగే సుదర్శన్, యాదయ్య, రవీందర్ పాల్గొన్నారు.

రక్తదాతకు సన్మానం



నవీన్‌ను సన్మానిస్తున్న డాక్టర్లు

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ-పితృదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 6సంవత్సరాలకు పైగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తం అవసరమైన వారికి ఇప్పిస్తూ తాను రక్తదానం చేస్తున్న కురుమేటి నవీన్‌ను ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రిలో, నల్లగొండలోని రక్షా బ్లడ్ బ్యాంకులో సన్మానించి మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ దివ్య ప్రపుల్ల, డాక్టర్లు పవన్‌కుమార్, స్వాతి, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, గౌతమ్, సైదులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

అడ్డగూడూరు : విద్యుదాఘాతంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చిన్నపడిశాల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ముగబోయిన రవి పాడి గేదెను మేతకోసం విడిచిపెట్టగా మేసుకుంటూ వెళ్లి సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.90 వేల ఉంటుందని, ప్రభుత్వం అందుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

తుర్కపల్లి : విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అకుల యాదగిరి గేదె పొలం మేత మేస్తుండగా అప్పటికే పొలం తెగిపడి ఉన్న విద్యుత్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.లక్షన్నర ఉందని వాపోయాడు.

నేతన్న భరోసా అమలు చేయాలి

మోత్కూరు : ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా పథకాన్ని వెంటనే అమలు చేసి, అర్హత కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి అందించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పాలడుగు గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తరువాత అత్యంత ప్రాధాన్యం కలిగిన చేనేత పరిశ్రమ, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్వీర్యం అవుతుందని విమర్శించారు. చేనేత కార్మికులు నేసిన బట్టల నైపుణ్యాన్ని, ప్రతిభను దేశ విదేశీయులు కొనియాడుతున్నా వారి జీవన స్థితిగతులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పాలడుగు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్ల నాందేవ్, కార్మిక సంఘం జిల్లా నాయకులు చింతకింది సోమరాజు, వడ్డేపల్లి లక్ష్మణ్, జెల్ల సత్యనారాయణ, జెల్ల వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

మోత్కూరు : మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 6వవార్డు ఆరెగూడెంలో తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేర్వేరు చేసి సేకరించుట, పారిశుద్ధ్య సిబ్బందికి, పట్టణ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. పట్టణ ప్రజలు తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా చేయడానికి పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, పర్యావరణ ఇంజనీర్ శ్రవణ్‌కుమార్, శానిటైజేషన్ సూపర్‌వైజర్ వీరస్వామి, రిసోర్స్‌పర్సన్‌లు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలి

రాజాపేట : చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని హెచ్ఎం నెమిల భరత్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణకుమారి అన్నారు. శనివారం మండంలోని నెమిల ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ చిన్నారులను చేర్పించగా వారికి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, శోభ, ఎస్ఎంసీ చైర్మన్ గుజ్జ లక్ష్మి, మేక లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని ఇంద్రపాలనగరంలో ఇటీవల మృతి చెందిన గుర్రం నర్సింహ-సునీత కుటుంబ సభ్యులకు స్థానిక బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గర్దాసు విక్రం శనివారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అదే విధంగా గర్దాసు సత్తయ్య కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నీర్నెముల గ్రామంలో శుక్రవారం మృతిచెందిన సుర్వి స్వామి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు కందిమల్ల గోపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. సిరిపురం గ్రామంలో కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తుంగ గోవర్ధన్ కుటుంబానికి జొన్నలగడ్డ రవీందర్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వలిగొండ : పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల విద్యుత్ ఏఈ నర్సింహ శనివారం తెలిపారు.

రేషన్‌కార్డులో మార్పులకు దరఖాస్తు చేసుకోవాలి

తుర్కపల్లి : రేషన్‌కార్డులో కొత్త సభ్యుడి పేరు చేర్చడం లేదా పాతకార్డు నుంచి పేరు తొలిగించడం వంటి మార్పులకు మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ దేశ్యానాయక్ అన్నారు. శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆధార్‌కార్డు, నివాస ధ్రువీకరణ, పాత రేషన్‌కార్డు పత్రాలతో మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోంటే మూడురోజుల్లో రేషన్‌కార్డు అందుతుందన్నారు.

చెగువేరా స్ఫూర్తితో ఉద్యమించాలి

రామన్నపేట : అణగారిన వర్గాల ప్రజలకోసం పోరాడిన చెగువేరా స్ఫూర్తితో యువకులు ఉద్యమించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగటి ఉపేందర్, జిల్లా సహాయ కార్యదర్శి మెట్టు శ్రవన్‌కుమార్ తెలిపారు. శనివారం చేగువేరా జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, అంజయ్య, ఆనంద్, హన్మంత్, నాగేష్, సైదులు, లెనిన్ ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామన్నపేట : మండల కేంద్రంలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయం తృతీయ వార్షికోత్సవ వేడుకలను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భైరబోయిన లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ సాల్వేరు రోజాలింగం, జాల శేఖర్‌రెడ్డి, మోటె గోపాల్, జెల్ల వెంకటేశం, మల్లికార్జున్, శివ,మల్లేశం పాల్గొన్నారు.